కథ

# పరివర్తన

ఎస్.ఇందిరానాగేశ్వర్

**"మమ్మీ! మా టీచర్ యాభై రూపాయలు తీసుకు రమ్మన్నారు. ఇవ్వవా!" అంటూ దగ్గరికి వచ్చి చీర లాగుతూ అడుగుతున్నాడు రేషూ.**

**"మళ్ళీ దేనికి?" విసుగ్గా అడిగింది శైలజ.**

**"మాజిక్ షో ఉందట. దాని కోసం. ఇవ్వు మమ్మీ! నాకు లేట్ అయిపోతోంది" అంటూ కంగారు పెట్టేస్తున్నాడు.**

"ఈమధ్య చదువుకన్నా ఈ షోలు ఎక్కువైపోతున్నాయేమిటి? ఏదో ఒకటి చెప్పి ఈ నెలంతా చాలాసార్లు పట్టుకెళ్ళావు. అసలు ఒకసారి మీ స్కూలుకు వచ్చి టీచర్‌ను అడుగుతానుండు" అంది కోపంగా.

"ఇదే లాస్ట్ మమ్మీ! ముందు నాకివ్వు" అంటూ వేధిస్తుంటే ఇక ఇవ్వక తప్పలేదు శైలజకు.

రేషూ సంతోషంగా తన బ్యాగ్‌లో పెట్టుకుని "బై మమ్మీ!" అంటూ బైటికి పరుగుతీసాడు.

"జాగ్రత్త, ఏమిటా పరుగు? బస్ ఆగాక నెమ్మదిగా ఎక్కు" అంటూ శైలజ వెనకాల అరుస్తూ చెప్పింది.

వీడికీమధ్య హడావుడి ఎక్కువైంది. డబ్బులు డబ్బులు అంటూ అస్తమానూ పట్టుకుపోతున్నాడు. నిజంగానే టీచర్ తెమ్మంటున్నారా? లేక వీడేమైనా అబద్ధాలు చెప్పి పట్టుకు వెళుతున్నాడా? అనే అనుమానం వస్తోంది.

రేషూ చిందర వందరగా పడేసినవన్నీ తీసి సర్దసాగింది శైలజ. సాయంత్రం ఒకసారి స్కూల్‌కి వెళితే తెలిసిపోతుంది, వీడు చెప్పేది నిజమో అబద్ధమో? ఆలోచిస్తూనే సర్దుతోంది. రేషూది డబ్బుల డిబ్బీ అలమారలో పెట్టబోయి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అది ఖాళీగా ఉంది.

"ఇదేమిటి? అందులో 200 రూపాయల పైనే ఉన్నాయన్నాడు రెండురోజుల క్రితం. ఇంతలో ఏమయ్యాయి?" ఆశ్చర్యపోయింది శైలజ.

ఆమె అనుమానం మరింత దృఢపడ్తోంది. వీడు ఏదో చేస్తున్నాడు అనుకోవడానికీ ఆమె మనసు అంగీకరించడం లేదు. రేషూకి స్కూల్లోనూ బంధువుల్లోనూ బుద్ధిమంతుడని మంచి పేరుంది. క్లాస్ ఫస్ట్ వస్తుంటాడని, బుద్ధిగా చదువుకుంటాడని అంతా పొగుడ్తుంటారు. సెకండ్ క్లాస్ చదివే పిల్లవాడిని అల్లరి చిల్లర ఖర్చులు చేసేస్తున్నాడని ఎలా అనుమానించగలం. శైలజకి అంతా అయోమయంగా ఉంది. ఆలోచిస్తూ అలా కూర్చుండిపోయింది.

కాలింగ్ బెల్ మోగింది.

శైలజ తల్లి, చెల్లెలు వచ్చారు. లోపలికి రమ్మనమని అన్యమనస్కంగానే వారిని ఆహ్వానించి మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

శైలజ అమ్మ, నాన్న, చెల్లెలు ఆ ఊర్లోనే ఉంటున్నారు. శైలజ చెల్లెలు వనజ డిగ్రీ చదువుతోంది. ప్రస్తుతం పెళ్ళి ప్రయత్నాలూ చేస్తున్నారు.

వేళగాని వేళ వాళ్ళురావడం శైలజకి ఆశ్చర్యం కలిగించింది.

"ఏమిటమ్మా! ఈ వేళప్పుడు వచ్చారు? ఏదైనా విశేషమా? వనజకేమైనా పెళ్ళి కుదిరిందా?" అని ఆసక్తిగా అడిగింది.

"అదేంకాదే శైలూ! మొన్న ఆదివారం మీరు మనింటికి వచ్చారు కదా! అప్పుడు రేషూ మీనాన్న దగ్గర పుట్టినరోజుకి డ్రస్ కొనుక్కుంటానని 500 రూపాయిలు ఇమ్మని అడిగితే మీ నాన్న ఇచ్చారట. అవి నీకు ఇచ్చాడో లేదో అడుగుదామంటే ఫోన్ రిపేర్‌లో ఉంది. అందుకని మేమే వచ్చాం" అంది శైలజ తల్లి రాధమ్మ.

శైలజకు కళ్ళు బైర్లు కమ్మాయి. సమస్య ఇంకా జటిలమవుతున్నట్లనిపించింది. ఒక్కసారిగా ఏడుపు తన్నుకువచ్చింది. తల్లిని కావలించుకుని వెక్కివెక్కి ఏడ్చింది. కొడుకు దారి తప్పుతున్న భావనని శైలజ భరించలేకపోతోంది.

"ఏమిటే ఏమైంది?" అంటూ రాధమ్మ, వనజ కంగారుపడ్డారు.

రేషూ డిబ్బీలో డబ్బులు లేకపోవడం, అస్తమానూ టీచర్ తెమ్మన్నారంటూ డబ్బులు పట్టుకువెళ్ళడం ఇవన్నీ శైలజ వివరించి చెప్పింది.

శైలజ చెప్పింది విని, వారు కూడా ఆశ్చర్యపోయారు.

"అక్కా! స్కూలుకు వెళ్ళి నిజమేమిటో కనుక్కుందాం పద" అంది వనజ.

వంటపని తల్లికి అప్పగించి వనజతో కలిసి స్కూలుకి బయలుదేరింది శైలజ.

వనజ, శైలజ వెళ్ళేసరికి ఏదో ఫంక్షన్ జరుగుతున్న సూచనగా స్కూలు ఆవరణ అంతా పిల్లలతో సందడిగా ఉంది. స్టేజీపై పెద్దలంతా ఆశీనులై ఉన్నారు.

శైలజ, వనజ అక్కడ ఖాళీగా ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు.

రేషూ మ్యాజిక్ షో అన్నాడు. బహుశా అదే జరుగుతోందనుకుంది శైలజ. మనసు కొంత నెమ్మదించింది. వాడు చెప్పింది నిజమే అయి ఉంటుంది అని తృప్తిపడింది.

కానీ శైలజ అనుకున్నట్లుగా జరగలేదు. పెద్దలు, హెడ్‌మాష్టారు సునామీ అల్లకల్లోలం గురించి, ఆ దుర్ఘటనలో సర్వం కోల్పోయినవారిని, అనాథలను ఆదుకోవాల్సిన బాధ్యత గురించి అనర్గళంగా ఉపన్యసిస్తున్నారు. తరువాత పిల్లలు అందించిన విరాళాల గురించి చెబుతూ అందరికన్నా ఎక్కువ విరాళం ఇచ్చాడంటూ రేషూని ఆకాశానికి ఎత్తేస్తూ అందరూ పొగుడుతున్నారు. రేషూని స్టేజీమీదకు పిలిచి మెచ్చుకుంటుంటే అందరూ చప్పట్లతో తమ హర్షాన్ని వెలిబుచ్చారు.

శైలజ, వనజ రేషూ గురించి చెప్పినది విని నివ్వెరపోయారు. రేషూ ఒక మంచి పనికోసం చెప్పిన చిన్న చిన్న అబద్ధాలు వారినిప్పుడు బాధించడం లేదు. ఆ చిన్న అబద్ధాల వెనుక వాడి పెద్ద మనసును వారు అర్థం చేసుకున్నారు. వారికి ఆనందం కలిగింది.

ఫంక్షన్ పూర్తి అయింది. పిల్లలంతా రేషూకి కంగ్రాట్స్ చెబుతూ అభినందిస్తున్నారు. శైలజ, వనజ రేషూ దగ్గరకు వెళ్ళారు. రేషూ ముఖం ఆనందంతో వెలిగిపోతోంది.

తల్లిని చూసి రేషూ "సారీ మమ్మీ! నీకు అబద్ధాలు చెప్పాను. ఇంకెప్పుడూ ఇలా చేయను" అన్నాడు సిగ్గుపడుతూ.

"రేషూ, విరాళం ఇవ్వడం తప్పు కాదు నాన్నా! కానీ, దానికోసం ఇన్ని అబద్ధాలు చెప్పడం మాత్రం నిజంగానే తప్పు. అలా ఎందుకు చేసావు?" అని అడిగింది వనజ.

"నిజం చెబితే అమ్మ ఇవ్వదు పిన్నీ" అన్నాడు నెమ్మదిగా తల వంచుకుని.

"పాతబట్టలివ్వమని, కాస్త డబ్బు సాయం చెయ్యమని కొంతమంది మా ఇంటికి వచ్చి అడిగితే అమ్మ ఇవ్వకుండానే పంపేసింది. పాత బట్టలు బోల్డు ఇచ్చి స్టీలు గిన్నెలు తీసుకుంటుందిగానీ పేదవాళ్ళకు ఇవ్వదు. నాకు వాళ్ళని చూస్తే ఏడుపు వస్తుంది పిన్నీ.



వూ
ఇంట్లో పనిచేసే సీత కొడుక్కి నా బట్టలివ్వాలని ఉంటుంది. కానీ మమ్మీ ఇవ్వ నివ్వదు. చిరిగిన బట్టలతో ఉన్న వాడిని చూస్తే జాలి వేస్తుంది. 'స్కూలు తరుపున విరాళం ఇస్తున్నాం. మీరు కూడా మీకు తోచినంత సాయం చేయవచ్చని' టీచరు చెప్పారు. అందుకనే నా డిబ్బీలోవి, తాతయ్య ఇచ్చినవి, అమ్మ ఇచ్చినవి అన్నీ విరాళంగా ఇచ్చాను పిన్నీ" అన్నాడు రేషూ.

శైలజ తన ప్రవర్తన తలుచుకుని సిగ్గుపడింది. చిన్న వాడైనా రేషూ ముందు తనే చిన్నదిగా అనిపించింది. సాటి మనుషుల పట్ల దయ చూపించడం గురించి చిన్నపిల్లవాడితో చెప్పించుకోవలసి వచ్చినందుకు బాధ కలిగినా, తన కొడుకు ఔన్నత్యం చూసి గర్వపడింది. రేషూని క్లాస్‌కి పంపించి ఇంటికి తిరిగి వచ్చారు అక్కా చెల్లెళ్లిద్దరూ.

* * *

మరునాడు ఉదయం సీత పనిలోకి వచ్చింది. అది ఎంతో బాధల్లో ఉన్నట్లు దాని ముఖం చూస్తేనే తెలుస్తోంది. పనిచేస్తూనే మాటిమాటికీ కళ్ళనీళ్ళు తుడుచుకుంటోంది.

శైలజ ఇది గమనించింది. "ఏమిటే సీతా ఏమైంది? అలా ఉన్నావు?" అని అడిగింది.

ఎప్పుడూ విసుక్కుంటూ, కసురుకుంటూ పనిచేయించుకునే అమ్మగారు అంత సౌమ్యంగా కష్టం, సుఖం అడుగుతుంటే సీతకు కన్నీరాగలేదు. ఏడుస్తూనే తాగుబోతు భర్తవల్ల తాను పడుతున్న బాధలు, కొడుకుని స్కూల్లో చేర్పించడానికి డబ్బులేక తాను పడుతున్న ఇబ్బందులు అన్నీ ఏకరువు పెట్టింది.

సీత బాధలన్నీ విని శైలజ మనసు కరిగిపోయింది.

రేషూవి పాతబట్టలు, తనవే రెండు పాత చీరలు, జాకెట్లు తెచ్చి సీతకిచ్చింది. భర్తనడిగి కొంత సొమ్ము తెచ్చి సీతకిచ్చి పిల్లవాడ్ని చదివించుకోమని చెప్పింది.

సీత కళ్ళకు శైలజ దేవతలా అగుపిస్తోంది. కృతజ్ఞత నిండిన గొంతుతో "అమ్మగారూ" అంటూ శైలజ కాళ్ళపై పడింది.

ఒక మంచి పని చేస్తే కలిగే ఆనందాన్ని శైలజ పరిపూర్ణంగా అనుభవించింది.

ఇదంతా చూస్తూ రేషూ

శైలజ
ఆఫీసులో ఉన్న భర్తకు ఫోన్ చేసి కొడుకు గురించి గర్వంగా చెప్పింది. భార్య మాటల్లో పశ్చాత్తాపం గుర్తించాడు రమేష్. ఆమెలో పరివర్తన వచ్చినందుకు, దానికి కొడుకు కారణమైనందుకు ఆనందించాడు.

తండ్రిని కౌగలించుకున్నాడు సంతోషంగా. వాడికి ప్రపంచాన్నే ఉద్ధరించినంత ఆనందంగా ఉంది.